# మంచం బొమ్మలు

అమ్మమ్మ షష్టిపూర్తికి అందరూ రావాలని తాతయ్య ఉత్తరం రాశారు.

అమ్మతోబాటు నేనూ తమ్ముడూ ముందుగానే బయల్దేరాం. నాన్న ఫంక్షన్‌నాడు వస్తానన్నారు.

చనిపోయినవాళ్లకి షష్టిపూర్తి ఏమిటి? కొంత ఆశ్చర్యపోయాం- అమ్మయితే కన్నీళ్లు పెట్టేసుకుంది!

అమ్మమ్మ చనిపోయి మూడు ఏళ్లు అయింది.

అవును! అప్పటికి అమ్మమ్మకి 57 ఏళ్లు అని చెప్పుకోవటం నాకు జ్ఞాపకం ఉంది.

తాతయ్య అమ్మమ్మకి షష్టిపూర్తి చేస్తున్నాడంటే... ఆయన ప్రేమ అంత గొప్పది అన్నమాట -

తప్పకుండా వెళ్లాలి - లక్కీగా సెలవురోజులు కల్సివచ్చాయి. ఛలో అంబాజీపేట అనుకున్నాం!

చుట్టూ చేలమధ్యలో అమ్మమ్మ ఇల్లు పెంకుటిల్లయినా దర్జాగా ఉంటుంది. రెండేళ్లక్రితం క్రిస్మస్ సెలవులకి వచ్చాం. 'సంక్రాంతి వరకు ఉండండే' అని తాతయ్య బతిమాలాడు.

"మాకు సంక్రాంతికి ఇన్ని సెలవులు ఇవ్వరు తాతయ్యా. మేమంతా కిరస్తానీవాళ్లం. క్రిస్మస్‌కే మా స్కూళ్లకి సెలవులిస్తారు" అని చెప్పాను.

తాతయ్యకి నేనంటే చాలా ఆపేక్ష - అచ్చు అమ్మమ్మ పోలికే నాదిట!

అమ్మమ్మ పెళ్లి అయి ఈ ఇంట్లో అడుగు పెట్టినప్పుడు నా ఏజే - పదిహేడేళ్లుట! ఇప్పుడు నేను తాతయ్య కన్నా గుప్పెడు పొడుగు ఎదిగి పోయాను.

షష్టిపూర్తి సంబరంగా జరిపించాడు. చుట్టాల్నీ, స్నేహితుల్నీ పిలిచి చీర, పసుపూ, కుంకంభరిణిలూ, పూలూ ఇప్పించాడు తాతయ్య.

మా అమ్మా పిన్నమ్మలూ ఎంత ఆనందంగా జరిపారో ఆ పండగ!!

✣ ✣ ✣

పండగయిన నాటి రాత్రి భోజనాలయ్యాక "ఇవేంటి తాతయ్యా..."

ఒకే సైజులో ఉన్న నాలుగు నగిషీల చెక్క దిమ్మల్ని చూసి అడిగింది కల్యాణి –

తాతయ్య కళ్లల్లో గుండ్రాలు తిరుగుతున్నాయి.

ఫ్లాష్‌బ్యాక్‌కి వెళ్లబోతున్నట్లు చూపుల్తో 'లీడ్' ఇస్తున్నాడు.

"కొశ్చనేశావూ... ఇండియాకి ఇండిపెండెన్స్ రాని క్రితానికి మనని దొర్లించేస్తాడు తాతయ్య..." కల్యాణిని ఖయ్యిమన్నాను... సరదాగా తిడుతూ.

తాతయ్య బోసినవ్వుల్తో... "పోన్లేవే వాటి కథలు చెప్పను... మిమ్మల్ని విసిగించను!! మీరెళ్లి టీవీ పెట్టుకోండి"

తాతయ్య మామూలుగా అన్నా మనస్సు మూలిగిందని నాకు అర్థం అయ్యింది. బాధేసింది. 'అయ్యో అనవసరంగా తాతయ్యని హర్ట్ చేశానా' అని... "టీవీ వొద్దుగానీ ఆ చెక్కదిమ్మల కథ చెప్పు తాతయ్యా ప్లీజ్! ముఝే మాఫ్ కర్‌నా! మాం క్షమయా!" నాకు తెల్సున్న భాషలన్నిటిలోనూ బతిమాల్తూ ముందుకు కుర్చీ లాక్కున్నాను– నేనూ, కల్యాణీ... రాణీ... తమ్ముడూ అందరూ ముందుకొచ్చాం.

తాతయ్య బెట్టు దిగి కథ మొదలెట్టటానికి... పది నిమిషాలు పైనే గారాలు పోయాడు. ఈ మధ్యలో కిటికీలో ఉన్న ఆ చెక్క దిమ్మల్ని పిల్లలం నలుగురం నాలుగూ... చేతుల్లోకి తీసుకొని దాని పనితనం పరికిస్తున్నాం.

రెండు పాములు పెనవేసుకుని చుట్టుకున్నట్లు ఆ దిమ్మ మొదలైంది. మూడు ఆవృత్తాలు పూర్తవ్వగానే... చంద్రహారంలా ముప్పేట లతలూ... కాస్త పైకి వెళ్తే కైవారం చుట్టూరా తొండాలతో ముందున్న ఏనుగు తోకలు పెనవేసుకున్నట్లు గజమాలిక – ఆ పైన అష్టభుజిలాగ దళసరిగా చెక్కిన

దిమ్మ.

టేకుచెక్కతో చేశారేమో దృఢంగానూ బలంగానూ చెక్కుచెదరకుండా ఉన్నాయవి. ఇప్పట్లా మోటార్ రంపాలు మిషన్ కర్వింగ్ టూల్స్ లేని రోజుల్లో, మైన్యూట్‌గా కేవలం చేతి పనిముట్లతో అంతటి దారుశిల్పాలు చెక్కేరంటే చాలా ఆశ్చర్యమేస్తుంది. చిన్నప్పుణ్నుంటి వాటిని చూస్తున్నా వాటి గురించి ప్రత్యేకంగా అడగాలనిపించలేదు. కాస్త పాలీష్ చేసి పోష్ ఆఫీసుల్లో పేపర్ వెయిట్‌గా వాడుకోవచ్చంటే ఆ పనితనానికి నాలుగింటికీ కలిపి నాలుగు వేలు వస్తాయనీ, విడివిడిగా అమ్మితే 15 వందల రూపాయలకొకటి బేరమాడకుండా కొనేస్తారనీ ఈ మధ్య శిల్పారామం హస్తకాళా ప్రదర్శనల్లో తిరిగిన నాకు బోల్డంత క్రాఫ్ట్.... కాస్ట్ గురించి ఎస్టిమేట్ చేసే నాలెడ్జి వచ్చేసింది. 6 అంగుళాల పొడుగు, ఐదు అంగుళాల కైవారం కలిగిన ఆ దిమ్మలకి చిన్నా చితకా ఫ్లాష్‌బ్యాక్ ఉండి ఉండదు. అందుకే రెట్టించి అడిగాం అందరం- తాతయ్య కళ్లు 'గుండ్రాల గుండ్రాల' ఫ్లాష్‌బ్యాక్ నుంచి చిత్తడిబారాయి.

"ఒరేయ్...! ఫ్లాష్‌బ్యాక్ వద్దనుకున్నాగానీ ఇది ఫ్లాష్‌బ్యాకేరా! చెప్పాలంటే ఇప్పటి కథకాదు. వినే ఓపికుంటే మొదలెడతాను. ఈ దిమ్మలు మీ అమ్మమ్మ నాన్నగారు చేయించారు. అంటే... మా మావగారు... చేయించి ఇచ్చారు. మీ అమ్మమ్మ కాపురానికొచ్చినప్పుడు. పందిరిమంచం కోళ్లకి పెట్టిన దిమ్మలన్నమాట ఇవి"

"అంటే... దాదాపుగా..." కేలిక్లేటర్ లేదని కంగారు పడుతున్నాను. "మీ అమ్మ పుట్టిన ముందు ఏడాది అంటే 1965లో మీ అమ్మమ్మ కాపురాని కొస్తూ ఆ మంచం, కోళ్లకింద ఉండే ఈ దిమ్మల్తో సారె తెచ్చుకుంది. ఆ మంచం మీదే మీ అమ్మ పుట్టి పెరిగింది. కల్యాణి వాళ్లమ్మా, రాజుగాడి

తల్లీ అందరూ ఈ మంచం కోళ్ల దిమ్మల సాక్ష్యంతో పుట్టి పెరిగిన వాళ్లే... వాళ్లే కాదర్రా, మీరంతా కూడా" అన్నాడు తాతయ్య.

ఎందుకో డిటేల్స్ డేట్స్ అడగాలని అనిపించలేదు.

"ఆ మంచం... ఏది తాతయ్యా?" అన్నాను మొహమాటంగానే.

"నువ్వు కొన్నాళ్లు దానిమీద పడుకున్నావే భడవకానా! మీ అమ్మమ్మ నిన్ను పక్కలో పడుకోపెట్టుకొని నీతో పక్క తడిపించి నాతో తిట్లు తినేది"

అందరూ నవ్వారు... నేను సిగ్గు పడ్డాను.

"సర్లే కథ చెప్పు ఆ తర్వాత...." నా ఆదుర్దా.

"అసలా మంచం ఏమయ్యింది?" కల్యాణి ఆత్రం.

తాతయ్య కళ్లలో తెల్లటి నీటిపొర ఉబికి మాయమైంది.

✦ ✦ ✦

సరస్వతికీ సుబ్బారావుకీ పెళ్లయి నాలుగేళ్లయింది.

సుబ్బారావు సర్వస్వతికన్నా నాలుగేళ్లు పెద్దాడు. వాళ్ల పెళ్లయి నాలుగేళ్లు. 14వ ఏట కాపురానికొచ్చినప్పుడు పందిరిమంచం సారెగా తెచ్చుకుంది ఆమె! దానికింద పెట్టేవే ఈ నాలుగు దిమ్మలు - అవే ఈ కథా సూత్రాలు. మూడేళ్లు తిరిగేసరికి 10, 12 నెలల తేడాలో పుట్టిన ముగ్గురు ఆడపిల్లల తల్లి అయిపోయింది సరస్వతి.

దేవుడి దయవల్ల సంతాన జననం ఆగిపోయింది.

సంసారం సకల సౌభాగ్యాలతో సాగిపోయింది.

ముగ్గురు అమ్మాయిల పెళ్ళిళ్లకీ ఆ పందిరిమంచం కొత్త పెళ్లికూతుర్లా

పువ్వుల దండల్తో సింగారించుకుంది.

✦ ✦ ✦

"మీరంతా పుట్టి పురిటిస్నానం చేయించాక ఆ పందిరిమంచం మీద పడుకోపెట్టి మురిసిపోయేది మీ అమ్మమ్మ. అమ్మకడుపు చల్లగా అత్తకడుపు చల్లగా నీ పెళ్లి వేడుక కూడా ఈ మంచం మీదే జరగాలే అనుకుంది. 44 ఏళ్ల కాపురానికీ, 57 ఏళ్ల జీవితానికి ఓ రోజు... హఠాత్తుగా ఫుల్‌స్టాప్ పెట్టి వెళ్లిపోయింది. మూడేళ్ళక్రితం ఉత్తరాయణ పుణ్య ఘడియల్లో... చెప్పా పెట్టకుండా గుండె ఆపేసుకుంది. అదే మంచం మీద ఇద్దరం వయస్సుతో బాటు 'ఎడం' పెంచుకుంటూ, వయస్సు మరచిపోయి 'ఎడం' తగ్గించుకుంటూ... గడిపేసాం" తాతయ్య మాటలు మాకు గుండె బరువెక్కిస్తున్నాయి.

ఓ రాత్రివేళ... ఆవిడ బతుకు బండి ఆ మంచం మీదే ఆగిపోయాక...

మర్నాడు టెలిగ్రాంలు అందుకుని కూతుళ్లూ అల్లుళ్లూ ఒక్కపెట్టున రోదిస్తూ, మంచం మీదకి ఎగబడ్డారు.

మంచం పెళ్లుమంది. పందిరి కూలకుండా సుబ్బారావు ఆపాడుగానీ ఓ మేరకు విరిగిపడిపోయింది.

ఏడుపుల తతంగం పూర్తయ్యాక ఏడుపు ఆపుకున్న సుబ్బారావు చివరి పయనానికి ఆయత్తపడుతున్న బంధుమిత్రుల్తో గొంతువిప్పి ఒకే మాట చెప్పాడు.

"కట్టెల కోసం కబురుపెట్టద్దు – ఆ పందిరి మంచం ఆవిడదే. ఆవిడతోనే ఉండనీండి. ఆవిడతోనే పోనీయండి" అని! అలాగే జరిగింది. పందిరి మంచం ఆవిణ్ని దహనం చేసింది.

✦ ✦ ✦

"మంచం కింద ఉన్న దిమ్మలు నేను దాచుకున్నానర్రా ఆవిడ జ్ఞాపకం కోసం. నేను పోయినప్పుడు 'అక్కడ' మా మంచానికి తీసుకెళ్తాను" కథ ముగించాడు సుబ్బారావు.

కళ్ల నీళ్లు గిర్రున తిరిగాయి నాకు.

"అంటే...." అన్నాడు చిన్న తమ్ముడు.

"ఇవి నాతోబాటు స్మశానానికొచ్చి బూడిద అయిపోతాయిరా"

"వద్దు తాతయ్యా!! మీ ఇద్దరి జ్ఞాపకంగా ఈ దిమ్మెలు... కాదు బొమ్మలు మాకివ్వకూడదూ" అన్నాను నేను.

"మీకివి అంత నచ్చాయిటే" అంటున్నప్పుడు తాతయ్య గొంతు వణికింది. దుఃఖంతో కాదు – ఆనందంతో.

"నిజం తాతయ్యా నీ అంత – అమ్మమ్మ అంత నచ్చాయి"

అని చెప్పబోతుండగా ఏడుపు అడ్డొచ్చింది నాకు.

"పిచ్చి తల్లీ... ఈ నాలుగు దిమ్మలూ నీకేనే తీసుకో"

"మరి మాకో?" అంది పిన్ని కూతురు కల్యాణి.

"కల్యాణీ... మీ అక్క వాళ్లమ్మమ్మ పేరు పెట్టుకుంది కదా! అందుకని బుజ్జి సరస్వతికి ఇచ్చేద్దాం– పెద్ద సరస్వతి శభాష్ అంటుంది" అంటున్నాడు తాతయ్య. నాలుగు బొమ్మలూ లాక్కుని అక్కున జేర్చుకున్నాక... ఇందాక దీన్ని వెలకట్టినందుకు నన్ను నేను తిట్టుకున్నాను. వేలు కాదు – కోట్లు కాదు – వాటి విలువ మూడు తరాలంత.... పరంపర!

